సాక్షి
ములుగు
మంగళవారం | 11 | జూలై | 2023



ఆ పాప ఎవరు..?

అమెరికా దంపతులు.. వరంగల్‌కు చెందిన ఓ ఆరేళ్ల శిశువును దత్తత తీసుకునే అంశం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

- 8లో▸



సమష్టి కృషితోనే ఏ ప్లస్ గ్రేడ్

నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్(కౌన్సిల్ న్యాక్) బెంగళూరు.. కాకతీయ విశ్వవిద్యాలయానికి 'ఏ ప్లస్' గ్రేడ్ ప్రకటించిందని వీసీ తాటికొండ రమేశ్ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0^{0} /26.0^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు కురుస్తాయి. రాత్రిపూట ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హామీలు నెరవేర్చాలని ధర్నా



ములుగు: మునుగోడు ఉప ఎన్నికల ముందు మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. తొలుత జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి రహదారిపై ధర్నాకు దిగారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ అధికారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పులి చిన్న నర్సయ్య, ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి, కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీలో రద్దు చేసిన గీత కార్మికుల సొసైటీలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. గీత కార్మికులకు వాహనాలు, సేఫ్టీ మోకులను అందించాలన్నారు. ప్రతీ సొసైటీకి ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దొమ్మాటి సదయ్య, గొల్లపల్లి రాజేందర్ గౌడ్, తాళ్లపల్లి నరేందర్‌గౌడ్, శ్రీహరి, రాజు, వేణు, నర్సయ్య, ఎలంద్ర, సారయ్య, రమేష్, సురేందర్, పున్నం, సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ హాస్టల్ ఏర్పాటు చేయాలి




ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో ఎస్సీ విద్యార్థులకు ఎస్ఎంసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కలువల రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఇతర మండలాల నుంచి ఇంటర్, డిగ్రీ చదువుకునేందుకు వచ్చే విద్యార్థులకు వసతి లేక చదువుకు దూరమవుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఎస్సీ విద్యార్థులకు జిల్లా కేంద్రంలో వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్, రాకేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ ఫండ్స్ కేటాయించాలని వినతి



ములుగు : వెనుకబడిన ములుగు జిల్లాకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులు కేటాయించాలని కోరుతూ సింగరేణి సీఎండి శ్రీధర్‌కు సోమవారం రెడ్కో చైర్మన్ వై.సతీశ్ రెడ్డి వినతి పత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి ఏజెన్సీ ప్రజలు రోడ్డు, రవాణా సదుపాయాల విషయంలో పడుతున్న ఇబ్బందులను వివరించినట్లు వెల్లడించారు. గిరిజనుల సంక్షేమానికి, సాధికారతకు సహకారం అందించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై సీఎండి శ్రీధర్ సానుకూలంగా స్పందించారని సతీశ్‌రెడ్డి వివరించారు.

కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా వంట కార్మికులకు పెంచిన వేతనాలను ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. కార్మికులకు ప్రభుత్వం గ్యాస్, వంట సామగ్రి అందించాలన్నారు. వంట కార్మికుల రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించే వరకు సమ్మెను విరమించే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సామల రమ, రాజకుమారి, ప్రమీల, శోభ, పోచమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

ఐదు రోజులుగా కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

- మొదలైన సీజనల్ వ్యాధుల ముప్పు
- కంపు కొడుతున్న కాలనీలు



వెంకటాపురం(ఎం)లో చెత్తతో నిండిపోయిన రిక్షా

వెంకటాపురం(ఎం): పంచాయతీ కార్మికుల సమ్మెతో పల్లెలన్నీ కంపు కొడుతున్నాయి. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఐదు రోజులుగా సమ్మె చేస్తుండడంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులకు ప్రజలు గురవుతున్నారు. మరో వైపు డెంగీ, మలేరియా వ్యాధి బారిన ప్రజలు పడుతున్నారు. నిత్యం చెత్తను తరలించాల్సిన సిబ్బంది సమ్మె బాటలో ఉండడంతో ప్రజలు సైతం ఇంట్లోని చెత్తా చెదారాన్ని గ్రామ వీధుల్లో ఏర్పాటు చేసిన కుండీలలో వేస్తుండడంతో అవి నిండిపోయి కంపుకొడుతున్నాయి. డ్రెయినేజీలు సైతం శుభ్రం చేయకపోవడంతో నీరు నిలిచి రహదారుల వెంట దుర్గంధం వెదజల్లుతోంది.

వైరల్ ఫీవర్లు

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో వైరల్ ఫీవర్ బారిన ప్రజలు పడుతున్నారు. స్థానికంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్నప్పటికీ తగ్గడం లేదు. వైరల్ ఫీవర్ విష జ్వరాలుగా మారుతుండడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. జిల్లాలోని వాజేడు, వెంకటాపురం(కె), మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో ప్రజలు డెంగీ, మలేరియా వ్యాధులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం హనుమకొండ, వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్తూ వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన సదస్సులు నిర్వహించడంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వైద్యులు, ఏఎన్ఎంలు స్థానికంగా ఉండకుండా పట్టణాల నుంచి అప్ అండ్ డౌన్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారంలో మూడు రోజులు మాత్రమే ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్యుడు, ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సిబ్బంది స్థానికంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ఉన్నతాధికారులు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమ్మెతో స్తంభించిన పరిపాలన

జిల్లాలోని 9 మండలాల పరిధిలో 855 మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కార్మికులకు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు ఐదు రోజులుగా నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో గ్రామాల్లో పరిపాలన స్తంభించిపోయింది. ట్యాంకులకు నీటిని ఎక్కించడం, ప్రజలకు తాగునీటి సరఫరా, డ్రెయినేజీలు శుభ్రం చేయడం, పారిశుద్ధ్య పనులు, పన్నుల వసూళ్లు, వీధులు ఊడ్చడం, ట్రాక్టర్‌లో సెగ్రిగేషన్ షెడ్‌కు చెత్త తరలించటం తదితర పనులను చేసేవారు. వారి సమ్మెతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో గ్రామ పరిపాలన స్తంభించిపోయింది.



వెంకటాపురం(ఎం)లో నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

30 ఏళ్లుగా వెట్టిచాకిరీ



30 ఏళ్లుగా పంచాయతీ కార్యాలయంలో కారోబార్‌గా వెట్టిచాకిరీ చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నా. రూ.300 వేతనం నుంచి పనిచేస్తున్నా. 15 నెలలుగా ప్రభుత్వం రూ.8,500 వేతనం చెల్లిస్తోంది. ప్రభుత్వం ఇచ్చే వేతనాలతో పంచాయతీ కార్మికుల కుటుంబాలు గడిచే స్థితిలో లేవు. ప్రభుత్వం పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలి.

\- గుత్తికొండ రవి, కారోబార్, పాలంపేట

డెయిలీ వర్కర్స్‌తో పనులు చేపడుతున్నాం..



పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో డెయిలీ వర్కర్లను నియమించి పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నాం. ఇబ్బందులు రాకుండా ఉండేలా వర్కర్లను నియమించుకోవాలని సూచించాం.

\- వెంకయ్య, డీపీఓ

గిరిజనుల ఉపాధిపై దృష్టి పెట్టాలి

- యూనిట్ల మంజూరులో జాప్యం ఉండొద్దు
- ఐటీడీఏ పీఓ అంకిత్
- అభివృద్ధి కార్యక్రమాలు, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: గిరిజనుల ఉపాధి కల్పనపై సెక్టార్ అధికారులు దృష్టి పెట్టాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న ఏజెన్సీ మండలాల్లో ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పనుల పురోగతిపై సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ అంకిత్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ సంస్థలకు ఆహార సరఫరా ఎంతమేర దిగుమతి అయ్యిందని జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డిని ప్రశ్నించగా స్టాక్ వచ్చిందని, సంబంధిత కమిటీ సభ్యులతో స్టాక్‌ను ధృవీకరించిన తర్వాత సంస్థలకు సరఫరా చేస్తామని తెలిపారు. రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని పీఓ ఆదేశించారు. గిరిజన సంక్షేమ సంస్థల్లోని విద్యార్థులకు మెటీరియల్ సరఫరా స్థితిపై డిప్యూటీ డైరెక్టర్ పోచంను అడుగగా సక్రమంగా సరఫరా చేస్తామని వెల్లడించారు. గతంలో కొన్ని ఎంఎస్ఎంఈ, ఈఎస్ఎస్ యూనిట్లు మంజూరు చేయగా బ్యాంకర్ల జాప్యంతో అర్హులైన లబ్ధిదారులను గ్రౌండింగ్ చేయలేదని, గ్రౌండింగ్ ప్రక్రియపై సంబంధిత బ్యాంకర్లు, ఎంపీడీఓలతో మాట్లాడి పూర్తి చేయాలని ఏపీఓ వసంతరావును పీఓ ఆదేశించారు. గురుకుల విద్యాసంస్థల్లోని ఖాళీల భర్తీకి ప్రక్రియ చేపట్టాలని రీజనల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మిని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లందరికీ వారి బాధ్యతలు, వ్యక్తుల జాబ్ చార్ట్‌పై జిల్లా వారీగా ఒక రోజు శిక్షణ నిర్వహించి కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన మార్గదర్శకాలను తెలపాలని డీడీ, ఆర్‌సీఓలను ఆదేశించారు. బాలికల విద్యాసంస్థల్లో కరాటే తరగతులు నిర్వహించాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాసంస్థల్లో ప్రతీ అధికారి రెండు విద్యాసంస్థలను తనిఖీ చేసి పురోగతి, సమస్యలు, లోపాలను గుర్తించాలని, జీసీసీ సరఫరాలపై తనకు రిపోర్ట్ అందజేయాలని, పీఓ ఆదేశించారు. అలాగే అంగన్‌వాడీల్లోని అర్హులకు స్యామ్, మ్యామ్, ల్యాక్టేటింగ్ కిట్‌ల పంపిణీ స్థితిపై సీడీపీఓ హేమలతను ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి పెట్టాలని, పెండింగ్‌లో ఉంటే వెంటనే అన్ని కిట్‌లను పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పెట్రోల్ బంక్‌లు అవసరం ఉన్న ప్రదేశాలను గుర్తించి బంకుల ఏర్పాటుకు కావాల్సిన స్థలాలు, ప్రతిపాదనలు తనకు ఇవ్వాలని పీఓ వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ వసంతరావు, ఈఈ హేమలత, డీడీ పోచం, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, డీసీఓ వెంకటేశ్వర రాజు, ఏసీఎంఓ రవీందర్, పెసా కోఆర్డినేటర్ ప్రభాకర్, జేడీఎం కొండల్‌రావు, డిప్యూటీ తహశీల్దార్ రాహుల్ పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యరైతుల దినోత్సవం

ములుగు: జిల్లా కేంద్రంలో ఘనంగా సోమవారం మత్స్య రైతుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి తగిన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు సాదు రఘు, కంబాల రవి, డోలి రమేశ్, గండి కుమారస్వామి, ఏరువ విజయ్‌చంద్ర, గరిగె రఘు, డోలి సంతు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి శ్రీపతి

వినతులు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్లు వైవీ.గణేశ్, ఇలా త్రిపాఠి

ములుగు: ప్రజావాణి వినతులను సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను అదనపు కలెక్టర్లు వైవీ.గణేశ్, ఇలా త్రిపాఠిలు ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 57 దరఖాస్తులు వచ్చాయని ఇందులో 28 రెవెన్యూ శాఖ, 29 ఇతర శాఖలకు సంబంధించినవని తెలిపారు. ఉద్యోగులు తమ హాజరును ములుగు వెలుగు యాప్‌లో తప్పని సరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రసూన రాణి, జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, సీపీఓ ప్రకాష్, డీడబ్ల్యూఓ ప్రేమలత, విద్యాశాఖ అధికారి పాణిని, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మణ్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, డీఎం రాములు, డీసీఓ సర్దార్ సింగ్, డీపీఓ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో నులి పురుగుల నివారణ దినోత్సవంపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ఐటీడీఏలో వినతులు స్వీకరించిన పీఓ అంకిత్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి ఐటీడీఏ పీఓ అంకిత్ వినతులను స్వీకరించారు. వాటిని పరిశీలించి ఆయా సెక్టార్ అధికారులకు బదిలీ చేసి పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏటూరునాగారం గ్రామానికి చెందిన మండపు భాగ్యలక్ష్మి తన భర్త జీసీసీ సేల్స్‌మెన్ లచ్చుబాబు సస్పెండ్ అయ్యారని.. మళ్లీ ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నారు. గోవిందరావుపేట మండలానికి చెందిన రంజిత్ తన కుమారుడు ఆరోగ్య పరిస్థితి బాగాలేదని, ట్రైబల్ రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా పలు సమస్యలపై వచ్చిన వినతులను పీఓ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, డీడీ పోచం ,ఈఈ హేమలత, ఎస్ఓ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీలో కాలయాపన సరికాదు

ములుగు: రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత గొర్రెల పంపిణీ విషయంలో కాలయాపన చేయడం సరికాదని యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోరె రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సంఘం సభ్యులతో కలిసి సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ గొల్ల, కురుమలు అప్పులు చేసి డీడీలు తీసి 11 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బోల్ల రాజాలు, ఆయా మండలాల అధ్యక్షులు బేతి ఐలయ్య, నర్సయ్య, బొంతల శ్రీకాంత్, బుచ్చయ్య, శ్యాములు, రమేష్, బక్క కుమార్, తేజరాజ్, మల్లయ్య, సాములు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

నేతకానీలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలు

ఏటూరునాగారం: నేతకాని కులస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం, జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ కన్వీనర్ గోమాస శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జీపీ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 15 లక్షల పై చిలుకు జనాభా కలిగిన నేతకాని కులస్తులకు ప్రభుత్వాలు తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. అనంతరం నాయకులు పెద్దపల్లి పార్లమెంట్‌తో పాటు 4 అసెంబ్లీ స్థానాలు నేతకాని కులస్తులకు కేటాయించాలని, అటవీ ప్రాంతంలో ఉన్న గిరిజనేతరులకు పోడు పట్టాలివ్వాలన్నారు. ధరణి పోర్టల్ రద్దు చేయాలని, అసైన్డ్ భూములు, గోదావరి పరీవాహక ప్రాంతంలో వరద ముంపునకు గురవుతున్న ఎస్సీలకు ఇసుక రీచ్‌లు ఇవ్వాలని.. ఐటీడీఏ తరహా ప్రత్యేక ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తదితర తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజమల్లు, భీం సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు



'స్టేషన్'లో వార్

మాజీ ఉప ముఖ్యమంత్రుల మధ్య ముదిరిన మాటల యుద్ధం

- తారాస్థాయికి చేరిన వ్యక్తిగత ఆరోపణలు
- వేచిచూసే ధోరణిలో అధిష్టానం
- సీనియర్ ప్రజాప్రతినిధులతో పరిస్థితులపై ఆరా..
- కడియం కులంపై చర్చ జరగాలి.. : ఎమ్మెల్యే రాజయ్య
- నా పుట్టుకను ప్రస్తావించిన ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్సీ కడియం

సాక్షిప్రతినిధి, వరంగల్: జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే టి.రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. వ్యక్తిగత విమర్శలు ఆరోపణలు, రాజకీయంగా దుమారం రేపుతుండగా.. గులాబీ గూటిలో గుబులు పుట్టిస్తున్నాయి. కడియం శ్రీహరి దళితుడు కాదు.. అవినీతిపరుడు అంటూ ఎమ్మెల్యే రాజయ్య చేసిన ఆరోపణలపై కడియం కౌంటర్ ఎటాక్ చేశాడు. కుల ప్రస్తావనతోపాటు అవినీతి ఆరోపణలు నిరూపించాలి.. లేకుంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొంతకాలంగా 'స్టేషన్'లో ఇద్దరు మాజీ ఉప ముఖ్యమంత్రుల మధ్య వైరం సాగుతున్నా.. నాలుగైదు రోజులుగా అది పరాకాష్టకు చేరింది. ఆ ఇద్దరి పోటాపోటీ ప్రెస్‌మీట్‌లు, సమావేశాలతో కార్యకర్తలు, నాయకులు సైతం నియోజకవర్గంలో రెండు గ్రూపులుగా చీలిపోయి పాల్గొంటున్నారు. ఇంత జరుగుతున్నా అధిష్టానం మాత్రం వేచిచూసే ధోరణితో ఉండటం.. మరోవైపు సీనియర్ల ద్వారా ఆరా తీస్తుండటం రాజకీయవర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది.

అటాక్, కౌంటర్ అటాక్..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మధ్య అటాక్.. కౌంటర్ అటాక్‌లు, మాటల వాగ్వాటి, మాటల యుద్ధం పెరిగింది. జానకీపురం సర్పంచ్ నవ్య వేధింపుల ఆరోపణల నేపథ్యంలో కొంతకాలం మౌనంగా ఉన్న రాజయ్య నాలుగైదు రోజుల నుంచి కడియం శ్రీహరి టార్గెట్‌గా వాగ్వాటి పెంచారు. కడియం పద్మశాలి కులంలో పుట్టి బైండ్ల కులంలో పెరిగాడని ఆయన కులంపై చర్చ జరగాలంటున్నారు రాజయ్య. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ దళితులు రాజకీయంగా ఎదిగితే కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశాడని ఆరోపించారు. 14 ఏళ్లు మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఏ దళిత బిడ్డను ఎదగనీయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి దగ్గరికి వెళ్లి వర్ధన్నపేట నుంచి కావ్యకు టికెట్ ఇవ్వాలని అడుగుతున్న ఆధారాలు బయటకు వస్తున్నాయంటూ.. కొత్త ఆరోపణలను తెరమీదకు తెచ్చారు. మాదిగల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్న రాజయ్య.. శ్రీహరి అవినీతిపై ఖల్‌నాయక్ అనే పుస్తకం ఉందని.. దాన్ని త్వరలో ప్రజల ముందు ఉంచుతానని తెలిపారు. ఎవరు ఏంటో తేల్చుకునేందుకు బహిరంగ చర్చకు రావాలని రాజయ్య సవాల్ విసిరారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే రాజయ్య విమర్శలపైన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కూడా సోమవారం కౌంటర్ ఎటాక్ చేశారు. రాజయ్య స్థాయిని మరిచి వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని ధ్వజమెత్తిన ఆయన.. నా పుట్టుక, నా కూతురు కులాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించడం మనస్తాపానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు కోర్టు తీర్పుతో తాను ఎస్సీ, తల్లి బీసీ, తండ్రి ఎస్సీ అని స్పష్టం చేశారని, తల్లి సత్యం, తండ్రి అపోహ అని చేసిన కామెంట్స్‌కు, ఎన్‌కౌంటర్ సృష్టికర్త అన్నందుకు క్షమాపణ చెప్పాలని శ్రీహరి డిమాండ్ చేశారు. తాను ఎస్సీ అయితే తన కూతురు ఎస్సీ అవుతుందని, ఈ న్యాయ సూత్రాలు తెలియని రాజయ్య ఎమ్మెల్యేగా ఎలా ఉన్నావని ప్రశ్నించారు. అక్రమ ఆస్తులు ఉన్నాయని ఆరోపిస్తున్న రాజయ్య నిరూపిస్తే వాటిని నియోజకవర్గ దళితులకు పంపిణీ చేస్తానని స్పష్టం చేశారు. వారం రోజుల్లో ఆ ఆస్తుల వివరాలు తేల్చి ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ అధిష్టానం ఆరా..

బజారున పడ్డ ఎమ్మెల్సీ శ్రీహరి, ఎమ్మెల్యే రాజయ్య మధ్య రాజకీయ వైరంపై ఆ పార్టీ అధిష్టానం సీరియస్‌గా స్పందించే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. మొదటి నుంచి రాజకీయ ప్రత్యర్థులైన వీరిద్దరి మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు కొసాగుతోంది. ఎమ్మెల్యేగా తాడికొండ రాజయ్య వ్యవహరిస్తుండగా.. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న కడియం శ్రీహరి కూడా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంనే ఎంచుకున్నారు. 2019 సెప్టెంబర్‌లో వేర్వేరుగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన యాత్ర రెండు వర్గాల మధ్య విభేదాలకు ఆజ్యం పోయగా.. ఆ తర్వాత పరిణామాలు కూడా మరింత దూరం పెంచాయి. ఎవరికీ వారుగా నియోజకవర్గంలో సభలు, సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఫ్లెక్సీలు, ప్రొటోకాల్ వివాదం.. అంటూ ఇరువర్గాల మధ్యన తరచూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. అయితే 20 రోజుల వరకు కూడా పరోక్షంగా ఆరోపణలు చేసుకున్న ఇద్దరు నేతలు కాస్తా ఇటీవల దూకుడు పెంచారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్వరం మరింత పెంచారు. ఈ క్రమంలో ఒక దశలో అధిష్టానం సూచనలను కూడా ధిక్కరించేందుకు వెనుకాడటం లేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు, మాజీ ఉప ముఖ్యమంత్రులు పోటీపోటీగా ప్రెస్‌మీట్‌లు ఏర్పాటు చేసి బహిరంగంగా ఆరోపణలు చేసుకోవడం దేనికి సంకేతం? అన్న చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధిష్టానం సైతం సీరియస్‌గా ఆరా తీస్తుండటంతో.. 'స్టేషన్'లో ఏం జరుగబోతోంది? అన్న ఆసక్తి అందరిలో నెలకొంది.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

వాజేడు: మండల పరిధిలోని పేరూరు పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా క్రైమ్ రికార్డులు చూడటంతో పాటు సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. వర్టికల్ సిస్టమ్, గ్రామ పోలీసు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. భవిష్యత్‌లో జరగబోయే ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఏఎస్పీతో పాటు ఎస్సై రుద్రారపు హరీశ్, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రావు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్పీ

క్లుప్తంగా

సంరక్షలో చేరిన 'బలగం' మొగిలయ్య



కాశిబుగ్గ : 'బలగం' ఫేం మొగిలయ్య అస్వస్థతతో సోమవారం వరంగల్‌లోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన మొగిలయ్య రెండు కిడ్నీలు పాడై గత కొన్నేళ్లుగా సంరక్ష ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. గత ఏప్రిల్‌లో చాతినొప్పి, ఆయాసం రావడంతో గుండె సమస్య ఉందని ఇక్కడి వైద్యులు గుర్తించి ప్రభుత్వ ఆదేశాలతో మొగిలయ్యను హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ కొన్ని రోజులు వైద్యం పొందిన మొగిలయ్య తరువాత డిశ్చార్జ్ అయి ఇంటివద్దనే ఉంటూ సంరక్షకు వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. సోమవారం కొంత అస్వస్థతకు గురికావడంతో సంరక్ష ఆస్పత్రిలో చేరాడు. అతడిని పరీక్షించిన వైద్యులు ఆరోగ్యంగా నిలకడగానే ఉందని ప్రమాదం ఏమి లేదని తెలిపారు.

కోతుల దాడిలో పలువురికి గాయాలు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ శివారులో ఉన్న వడ్డెపల్లి ట్యాంక్‌బండ్‌పై సోమవారం కొందరు వాకింగ్ చేస్తుండగా ఆకస్మికంగా కోతులు దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. ఇటీవల కొద్దిరోజులుగా ట్యాంక్‌బండ్‌పై పదుల సంఖ్యలో కోతులు ఇక్కడికి వచ్చి చేరాయి. నిత్యం ఉదయం వేళల్లో ప్రత్యేక ట్రాక్‌పై వాకింగ్ చేస్తున్న వ్యక్తులపై కోతులు దాడి చేయడంతో నలుగురు గాయపడ్డారు. వెంటనే వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గాయపడిన బాధితులకు చికిత్స చేయించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంధ్య రాజేష్ మాట్లాడుతూ ట్యాంక్ బండ్‌పై కోతుల బెడదను నివారించాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఆరుగురిపై కేసు నమోదు

నర్సంపేట రూరల్ : ప్రేమికులు కులాంతర వివాహం చేసుకోగా, దీనికి స్నేహితుడు సహకరించాడనే నెపంతో అతడిని చంపుతామని బెదిరించి, ఇంట్లోని సామగ్రిని దహనం చేసిన కేసులో మరో ఆరుగురిపై పోలీసు కేసులు నమోదయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం నర్సంపేట మండలం ఇటుకాలపల్లికి చెందిన సర్పంచ్ మండల రవీందర్ కుమార్తె కావ్య అదే గ్రామానికి చెందిన రంజిత్ ఈనెల 4న ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ విషయమై హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఇరువురు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించగా తన భర్తతో కలిసి వెళ్తానని కావ్య.. రంజిత్‌తో వెళ్లింది. కాగా, ఇటుకాలపల్లికి చెందిన సామల సుజాత కుమారుడు రాకేశ్.. వీరి వివాహానికి సహకరించారని నెపంతో కావ్య తండ్రి మండల రవీందర్, భూక్య వీరన్న, బుడిగ వినయ్, ఎంపీటీసీ వీరన్న, పిట్టల శ్రీను, చెన్నారావుపేట చెందిన విజేందర్ చంపుతామని బెదిరించారు. అదే రాత్రి దాడి చేసి ఇల్లు, హోటల్ దహనం చేశారని తల్లి సుజాత ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఆ పాప ఎవరు..?

- వరంగల్‌లో విదేశీ దంపతుల దత్తత వివాదం
- చెల్లిపాప అంటూ జనన ధ్రువీకరణ పత్రాలు సృష్టి
- ఓసారి ఇన్ కంట్రీ అడాప్షన్ ఆప్షన్‌తో దరఖాస్తు
- ఇంకోసారి ఇంటర్‌కంట్రీ అడాప్షన్‌తో పిటిషన్
- వేర్వేరుగా ఉండడంతో ఆసక్తికరంగా మారిన కేసు



సాక్షి, వరంగల్: అమెరికా దంపతులు.. వరంగల్‌కు చెందిన ఓ ఆరేళ్ల శిశువును దత్తత తీసుకునే అంశం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆ పాపకు జనన ధ్రువీకరణ పత్రాలు సృష్టించడంతో పాటు ఏకంగా వీసా తీసుకుని అమెరికాకు తీసుకెళ్లేందుకు మూడు నెలల క్రితం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు నిరాకరించారు. ఆ తర్వాత జరిగిన దత్తత విధానమే ఇప్పుడూ అనుమానాలకు తావిస్తోంది. ఆ పాపను దత్తత ఇచ్చే విధానాన్ని వేగిరం చేయాలని కొందరు స్టేట్ అడాప్షన్ రిసోర్స్ ఆథారిటీ(సారా) అధికారులతో పాటు శిశు గృహ సందర్శన నివేదికను సమర్పించాలంటూ హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖలోని ఓ విభాగాధికారి ఒకరు అత్యుత్సాహం చూపారనే విమర్శలున్నాయి. వాస్తవానికి ఆ పాప వరంగల్ సిటీకి చెందినట్లు జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్నా.. ఆ శిశువును దత్తత తీసుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా హనుమకొండలోని బాలల సంరక్షణ విభాగానికి దరఖాస్తు వచ్చింది. దీంతో వరంగల్ జిల్లాలో దత్తత కార్యక్రమాలను పర్యవేక్షించే వారిని గృహ సందర్శన చేసి నివేదిక సమర్పించాలంటూ అడిగినట్లు తెలిసింది.

అక్కడా కుదరదనే...ఇక్కడకు వచ్చి..

అమెరికాకు చెందిన దంపతులు కరీం విరాణి, ఆశామా విరాణి అమెరికా నుంచి వచ్చి కొంపల్లిలో తాత్కాలిక నివాసం ఉంటున్నారు. వాస్తవానికి ఇంటర్ కంట్రీ అడాప్షన్ (ఓఏఎస్) చిల్డ్రన్ కోసం ఫారెన్ అడాప్షన్ ఏజెన్సీ(ఏఎఫ్ఏ) నోఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) సంబంధిత దేశం ఇవ్వాల్సి ఉంటుంది. ×వివిధ దేశాల్లో ఉన్న ఎంబసీలోని ఫారెన్ అథరైజ్డ్ ఏజెన్సీ (ఆపా) వద్ద పిల్లలు దత్తత కావాలని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అక్కడా వారి స్థితిగతులను అధ్యయనం చేశాకే ఆ దంపతులను కారాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆపా కోరుతుంది. అయితే కరీం, ఆశామీ విరాణి విషయంలో ఆపాను సంప్రదిస్తే అమెరికాలో ఉన్న చట్టాల ప్రకారం బతికున్న తల్లిదండ్రుల నుంచి పిల్లలను దత్తత తీసుకునేందుకు వీల్లేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. అందుకే హైదరాబాద్‌కు వచ్చిన వీరు ఇన్నర్ కంట్రీ అడాప్షన్ అనే ఆప్షన్ ద్వారా కారాలో దరఖాస్తు చేసుకున్నారు. కరీం విరాణి కొంపల్లిలో తాత్కాలిక నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి..తన సోదరి, వరంగల్‌కు చెందిన రషీదాబాను భోజని శిశువును దత్తత తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి అమ్మన్ అలీ భోజని, రషీదాబాను భోజని దంపతులకు 10, 8 ఏళ్ల ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే గతేడాది ఆమె గర్భవతి కాలేదని సమాచారం. దీంతో ఆ పాప ఎక్కడి నుంచి వచ్చింది...ఎవరి పాప...కొనుగోలు చేశారా అనే దిశగా అనుమానాలు వస్తున్నాయి.

వీరు రారు.. వారు రారు..

వరంగల్‌కు చెందిన అడ్వకేట్ కృష్ణ ద్వారా ఈ దంపతులకు సంబంధించి దత్తత ఆదేశాలు ఇవ్వాలంటూ కలెక్టర్ ద్వారా జిల్లా సంక్షేమ అధికారికి కొద్దిరోజుల క్రితం పిటిషన్ వచ్చింది. దీనిని పరిశీలించిన జిల్లా బాలల సంరక్షణ విభాగం .. ఇంటర్ కంట్రీ అడాప్షన్ పేరెంట్స్ (పాప్స్) కిందకు వస్తుందంటూ చెబుతూనే..అథరైజ్డ్ ఫారెన్ అడప్షన్ ఏజెన్సీ(ఏఎఫ్ఏ) నుంచి నిరంభ్యంతర పత్రం సమర్పించాలన్నారు. దీని ఆధారంగానే దత్తతను ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే పాప కోసం దరఖాస్తు చేసుకున్న విరాణి దంపతులు, ఆ పాప బయోలాజికల్ పేరెంట్స్ అయిన భోజని దంపతులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరు కాలేదు. ఇంకోవైపు ×హోమ్ స్టడీ రిపోర్ట్‌× ఇవ్వాలని లోకల్ రాజకీయ నేతల ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. వరంగల్ చార్‌బౌలీకి చెందిన ఫిజియో థెరపీ షర్మిలా.. దత్తత విషయంలో పలుమార్లు అధికారులను కలిశారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అనుచరుడినంటూ శ్రీనివాస్ గౌడ్ కూడా ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం. అయితే రషీదాబాను గర్భవతి కాకపోతే ఆ పాప ఎవరనే అనుమానం కలుగుతోంది. దీన్ని నిగ్గు తేల్చే దిశగా అధికారులు దృష్టి సారించాలి.

సమష్టి కృషితోనే 'ఏ ప్లస్' గ్రేడ్

- న్యాక్ ఏ ప్లస్‌తో కేయూకు ఎంతో ప్రయోజనం
- యూజీసీ ఫండింగ్ ఏజెన్సీల నుంచి నిధులు
- కేయూ వీసీ తాటికొండ రమేశ్



కేయూ క్యాంపస్: నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్)బెంగళూరు.. కాకతీయ విశ్వవిద్యాలయానికి 'ఏ ప్లస్' గ్రేడ్ ప్రకటించిందని, దీని వల్ల యూనివర్సిటీకి భారీ ప్రయోజనం చేకూరుతుందని వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. ఈ మేరకు సోమవారం కేయూలోని సెనేట్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. విద్యాబోధన, పరిశోధన, మౌలిక వసతులు కల్పనలో ముందుకెళ్తుందన్నారు. న్యాక్ 'ఏ ప్లస్' గ్రేడ్ రావడం వల్ల దేశంలోని ఫండింగ్ సంస్థల నుంచి పరిశోధనలకు, ప్రాజెక్టులకు ఎక్కువ నిధులు సేకరించడానికి అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా కేయూ స్వతంత్రంగా కొత్త కోర్సులను ప్రారంభించడానికి అధికారం ఉంటుందన్నారు.ఈ సారి దూరవిద్యకేంద్రం కూడా డుయల్ మోడ్‌లో న్యాక్ పరిధిలోనికి తీసుకొచ్చామన్నారు.దీంతో ఇక నుంచి దూరవిద్యాకేంద్రం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే వివిధ డిప్లొమా కోర్సులను కూడా యూజీసీ డెబ్ అనుమతి లేకుండానే ప్రవేశపెట్టుకునే అవకాశం కలిగిందన్నారు. విశ్వవిద్యాలయం 2003లో మొదటిసారి న్యాక్ బీ ప్లస్ గ్రేడ్ సాధించగా, 2009లో ఏ గ్రేడ్, 2017లో ఏగ్రేడ్ సాధించిందన్నారు 2023లో 'ఏ ప్లస్' సాధించడం ఆనందంగా ఉందన్నారు. యూనివర్సిటీలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని హాస్టల్, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ నిధులు రూ. 20 కోట్లతో ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం చేపడుతామన్నారు. అలాగే, కేయూ మొదటిగేట్ నుంచి రెండో గేట్ వరకు రోడ్డును వెడల్పు చేస్తామన్నారు. దీనికి సీఎస్ఆర్ నిధులు రూ. కోటీ విడుదల అయ్యాయన్నారు. కేయూ భూమిని రక్షించడానికి యూనివర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మిస్తామన్నారు. సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ టి శ్రీనివాస్, ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్ నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా స్పాట్ కౌన్సెలింగ్

- అడ్మిషన్ల ప్రక్రియకు సమయానికి చేరుకోని ఆర్‌సీఓ
- ఆందోళన వ్యక్తం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

ఏటూరునాగారం: ఇంటర్ ఫస్టియర్‌లో ఖాళీల భర్తీకి సోమవారం స్థానిక గిరిజన గురుకుల రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే ఉదయం 10.30 లకు సమయం ప్రకటించగా మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలలోని 6 కళాశాలలో సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులు స్పాట్ కౌన్సెలింగ్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారని, దూరప్రాంతాల నుంచి వచ్చిన తమకు వసతులు లేవని కళాశాల యాజమాన్యం, నిర్వాహకులను నిలదీశారు. 12.30 గంటల తర్వాత మహబూబాబాద్, జయశంకర్, ములుగు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి రావడంతో స్పాట్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. సీరోలు, కేసముద్రం, మహబూబాబాద్, ఏటూరునాగారం, కొత్తగూడ, కాటారం కళాశాలల్లోని ఖాళీగా ఉన్న సీట్లకు ఆర్‌సీఓ స్పాట్ కౌన్సెలింగ్ చేపట్టింది. పదిలో 10/10 జీపీఏ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి 8 జీపీఏ ఆ తర్వాత సీట్లకు అనుగుణంగా జీపీఏలను ఆధారంగా విద్యార్థులను పిలిచి సర్టిఫికెట్లు వెరిఫై చేసి సీట్లను భర్తీ చేశారు. ఆరు కళాశాలల్లో మొత్తం 275 సీట్లు ఉండగా సోమవారం నిర్వహించిన స్పాట్ కౌన్సెలింగ్ అడ్మిషన్లలో 105 మందిని భర్తీ చేశారు. 170 సీట్లు ఇంకా ఖాళీగానే ఉన్నాయని ఆమె తెలిపారు. అయితే ఎస్సీ, బీసీ, ఓసీలకు ఒక్కో గ్రూపులో ఒక్కో సీటు ఉంటుంది. ఆ సీట్లు భర్తీ కాగా ఎక్కువగా షెడ్యూల్ ట్రైబ్స్ సీట్లు మిగిలిపోయాయి. ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపగా సీట్ల కోటాలో వారికి అవకాశం లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఎస్సీ, బీసీ, ఓసీ సీట్లను సైతం పెంచాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. అయితే నిబంధనల ప్రకారం మాత్రమే స్పాట్ అడ్మిషన్లు ఇస్తామని ఆర్‌సీఓ తెలిపారు. కార్యక్రమంలో డీసీఓ వెంకటేశ్వరరాజు, ఏటూరునాగారం ప్రిన్సిపాల్ వసుంధర, కొత్తగూడ విజయ, కేసముద్రం స్వప్న, కాటారం లలితాదేవి, సీరోజు చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాలలో అడ్మిషన్ అవుతున్న విద్యార్థినులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఐదు తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు అపహరణ

స్టేషన్‌ఘన్‌పూర్ : తాళం వేసి ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరించిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన యాతం రమేష్ మండలంలోని నమిలిగొండ ప్రభుత్వ యూపీఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 7న శుక్రవారం హైదరాబాద్ నారపల్లిలోని కుమారుల వద్దకు వెళ్లాడు. ఇంటిముందు ప్రధాన తలుపు తాళం వేసి వెళ్లాడు. తాళం వేసి ఉన్న విషయాన్ని గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న ఆభరణాలను అపహరించారు. సోమవారం పాఠశాల ఉండటంతో రమేష్ విధులకు హాజరయ్యేందుకు ఉదయం ఇప్పగూడెంలోని ఇంటికి వచ్చాడు. ఇంటికి వేసి తాళం పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉండగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో ఉన్న అతడి తల్లికి చెందిన పుస్తెలు, తాడు, గుండ్లు, భార్యకు చెందిన మాటీలు, కమ్మలు మొత్తం ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహరించారన్నారు. అదేవిధంగా తల్లికి, భార్యకు చెందిన పట్టగొలుసులు, దేవుని వస్తువులు మొత్తం 50 తులాల వెండి ఆభరణాలు, రూ.8వేలు నగదు పోయినట్లు తెలిపాడు. సమాచారం అందుకున్న సీఐ ఎ.రాఘవేందర్ ఇప్పగూడెంకు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్ బృందం వచ్చి వేలిముద్రలు తదితర వివరాలను సేకరించారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న సీఐ

అదుపు తప్పి కారు బోల్తా..

- నలుగురికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలింపు



నల్లబెల్లి: కారు అదుపు తప్పి బోల్తాపడగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం తండాకు చెందిన గుగులోత్ రాజు, భూక్య శ్రీను, బోడ నరేశ్, గుగులోత్ అంజీ.. కారులో మండల కేంద్రానికి బయలుదేరారు. నల్లబెల్లి మధ్యలవాగువద్దకు రాగానే కారు అదుపు తప్పి వాగులో బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. కాగా, నర్సంపేట ఆర్డీవో ఆఫీస్‌కు వెళ్తున్న తహసీల్దార్ మంజుల ఘటనా స్థలిని సందర్శించారు. క్షతగాత్రులను పరామర్శించి 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఇదే ప్రాంతంలో ఇటీవల దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లికి చెందిన జేసీబీ ఆపరేటర్ పాండవుల అనిల్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం విదితమే. దీంతో ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేడియోస్టేషన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా రవికుమార్

హన్మకొండ: ఆకాశవాణి వరంగల్ కేంద్రం కార్యక్రమ నిర్వహణ అధికారిగా ఇల్లందుల రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ పోస్టు గత రెండు నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పని చేసిన గోపాల్ రావు రెండు నెలల క్రితం రిటైరయ్యారు. ఖాళీగా ఉన్న స్థానంలో ఇదే కేంద్రంలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న ఇల్లందుల రవికుమార్‌కు ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్(కార్యక్రమ నిర్వహణ అధికారి)గా పదోన్నతి కల్పించి ఇక్కడే నియమించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రవికుమార్‌కు వరంగల్ రేడియో క్యాజువల్ కాంపెరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోటె చిరంజీవి, క్యాజువల్ అనౌన్సర్స్ పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ రేడియో క్యాజువల్ కాంపెరర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి అర్షం సదానందం, గౌరవ అధ్యక్షుడు జనార్దన్, కోశాధికారి కుమార్, ఉపాధ్యక్షుడు గాదె శ్యామ్, ప్రచార కార్యదర్శి సందెల కిషోర్, కల్చరల్ కార్యదర్శి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సతీష్, మాలతి, గడ్డం శోభారాణి, భాగ్యలక్ష్మి, స్వప్న కుమారి పాల్గొన్నారు.



రవికుమార్‌ను సన్మానిస్తున్న క్యాజువల్ అనౌన్సర్స్

ఎంపీడీఓ హత్యపై ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు

బచ్చన్నపేట : రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యపై జాతీయ ఎస్సీ కమిషన్‌లో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ఆధ్వర్యంలో మృతుడి కుమారుడు అశోక్ ఫిర్యాదు చేశారు. రామకృష్ణయ్య హత్య కేసులో పలువురు ముఖ్య నాయకులు, అధికారులను బయటకురాకుండా చూస్తున్నారన్నారు. హత్యకు గురైన వ్యక్తి దళితుడు కావడంతో పట్టించుకోవడం లేదన్నారు. ఈ హత్య వెనుక ఉన్న ముఖ్య నాయకులను అరెస్టు చేసి రామకృష్ణయ్య కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.



జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి కల్పన

గురుకులం నుంచి విద్యార్థులు పరార్

- తల్లిందండ్రులకు సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయులు

ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లి శివారులో ఓ ప్రైవేటు భవనంలో ఏటూరునాగారం మండలం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను కొనసాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం గురుకుల పాఠశాల నుంచి సుమారు 10 మంది విద్యార్థులు పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రతి నెల రెండో శనివారం విద్యార్థులను తల్లిదండ్రులు కలవడం, ఔటింగ్‌కు అనుమతులను కల్పించారు. ఇదే అదనుగా భావించిన ఇంటర్ విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వెళ్లి మద్యం కొనుగోలు చేసి శనివారం రాత్రి భారీవర్షం, అందులో కరెంట్ లేకపోవడంతో ఒక రూములో ఇంటర్ విద్యార్థులు ఇద్దరు, 9వ తరగతి విద్యార్థులు ఏడుగురు మద్యం సేవించారు. ఇందులో పక్కనే ఉన్న 6వ తరగతి విద్యార్థి అదే రూంలో పడుకునేందుకు వెళ్లాడు. రాత్రి 10.30 గంటలకు పీఈటీ విద్యార్థులు పడుకున్నారా లేదా అనే విషయం పరిశీలించేందుకు వెళ్లగా ఓ రూంలో మద్యం సేవిస్తూ విద్యార్థులు పట్టుపడ్డారు. ఈ క్రమంలో విద్యార్థులను పీఈటీ మందలించారు. విద్యార్థులు తప్పును అంగీకరించి ఇంకోసారి తప్పు చేయమని క్షమాపణ పత్రాన్ని ఉపాధ్యాయులకు అందించారు. పీఈటీ విద్యార్థులు పాఠశాలలో చేసిన వ్యవహారాన్ని పీడీకి చెబుతానని తెలుపడంతో వారు భయాందోళనకు గురై ఆదివారం మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిపోయారు. విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయిన విషయం గమనించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులను ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

భయంతోనే ఇంటికి వచ్చాను

పాఠశాలలో మద్యం సేవించామని పీఈటీ కొట్టడంతో పాఠశాల నుంచి పారిపోయి వచ్చానని పరారైన విద్యార్థుల్లో ఓ విద్యార్థి తన మామకు ఫోన్ చేసి చెప్పాడు. 9వ తరగతి అన్న వాళ్ల దగ్గర పడుకునేందుకు వెళ్లానని నేను నిద్రించే సమయంలో అదే గదిలో అన్నవాళ్లు మందు తాగారని వాళ్ల పేర్లు చెప్పాలని సార్ కొట్టాడు. లేనిపక్షంలో రేపు పీడీ సార్‌కు చెబుతానని బెదిరించడంతో భయంతో ఇంటికి పారిపోయి వచ్చానని 6వ తరగతి విద్యార్థి తెలిపాడు.

పాఠశాలకు ప్రహరీ లేదు : ప్రిన్సిపాల్ అంకయ్య

ప్రైవేట్ భవనంలో గురుకుల పాఠశాలను కొనసాగిస్తున్నాం. పాఠశాలకు ప్రహరీ లేక పోవడంతో విద్యార్థులు బయటకు వెళ్తున్నారు. శనివారం ఔటింగ్ ఉన్నందున విద్యార్థులు బయటకు వెళ్లి మద్యం కొనుగోలు చేసినట్లు తెలుస్తుంది. పాఠశాలలో మద్యం సేవించిన విద్యార్థులపై చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు చేసిన తప్పును ఒప్పుకొని రాత పూర్వకంగా లెటర్ రాసి ఇచ్చారు. ఆదివారం మధ్యాహ్నం విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిన విషయం తెలిసిన వెంటనే హౌజ్ మాస్టర్లు తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించారు. పిల్లలు తమ ఇండ్లకు చేరుకున్నారు. విద్యార్థులను తీసుకొని పాఠశాలకు వస్తామని తల్లిదండ్రులు తెలిపారన్నారు.

వ్యాపారంలో నష్టం.. మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



జయాకర్(ఫైల్)

పర్వతగిరి: వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి మండలంలోని బూర్గుమళ్ల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన నాళం జయాకర్(40) బతుకుదెరువు నిమిత్తం ఐదు సంవత్సరాల క్రితం రఘునాథపల్లి గ్రామానికి వెళ్లాడు. వాటర్ డిస్ట్రిబ్యూటర్ వ్యాపారం చేసుకుంటూ కుటుంబంతో సహా అక్కడే స్థిరపడ్డాడు. కొన్ని నెలలుగా వ్యాపారంలో నష్టాలు రావడంతో తరచూ బాధపడుతుండే వాడు. ఇదే విషయం కుటుంబ సభ్యులకు కూడా తెలుపుతూ బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను అన్నారంలో ఉన్నానని, మోసం చేశానంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. విషయం తెలుసుకున్న తండ్రి వీరస్వామి వెంటనే కొందరి బంధువులతో కలిసి అన్నారం గ్రామం వెళ్తుండగా మార్గ మధ్యలో పురుగుల మందు తాగి మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య కళారాణి, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి వీరస్వామి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

భార్య మందలించిందని భర్త..



కుమారస్వామి(ఫైల్)

రఘునాథపల్లి: ఉదయం ఆటో తీసుకుని వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తున్నావు వచ్చిన డబ్బులు ఏమి చేస్తున్నావని భార్య మందలించడంతో మనస్తాపం చెందిన ఆటోడ్రైవర్ బొట్ల కుమారస్వామి(34) పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మేకలగట్టుకు చెందిన బొట్ల కుమారస్వామి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మహిళా సంఘంలో తల్లి పేర రూ.లక్ష, భార్య పేర రూ. 30 వేలు అప్పుగా తీసుకున్నాడు. నెలనెలా అప్పు తీర్చకపోవడంతో విషయం భార్య మమతకు తెలిసింది. దీంతో సోమవారం ఇంటి నుంచి ఆటో తీసుకుని వెళ్తుండగా రోజూ వచ్చిన డబ్బులు ఏమి చేస్తున్నావని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన కుమారస్వామి రఘునాథపల్లి బస్టాండ్ వద్దకు వచ్చాక పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

ఆడుకుంటూ వెళ్లి..

- నీటి సంపులో పడి బాలుడు అనంతలోకాలకు..



టిల్లు (ఫైల్)

నర్మెట: ఆడుకుంటూ వెళ్లిన ఓ బాలుడు.. నీటి సంపులో పడి మృతి చెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దండలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా కదిరి మండల ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన సిందే బ్రహ్మయ్య, సంధ్య దంపతులతోపాటు మరో కుటుంబం గ్రామాలలో సర్కస్ చేస్తూ సంచార జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం వెల్దండకు చేరుకున్న వీరు.. రెండు రోజుల నుంచి విన్యాసాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం పెద్దలు గ్రామంలోకి వెళ్లగా పిల్లలతో ఆడుకుంటూ వెళ్లిన టిల్లు (2) నీటి సంపులో పడ్డాడు. ఆలస్యంగా వచ్చిన బ్రహ్మయ్య.. బాలుడి జాడ కోసం వెతుకుతూ అనుమానంతో సంపులోకి చూడగా అందులో కనిపించాడు. దీంతో వెంటనే జనగామ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.

ఉరితాడుగా మారిన చెట్టు తీగ..

- చెట్టు మీద నుంచి జారిపడి తీగల్లో చిక్కుకుని వ్యక్తి మృతి

కేసముద్రం: మేకల మేత కోసం చెట్టుకు అల్లుకున్న తీగలను కోసేందుకు ఓ వ్యక్తి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో కాలుజారి తీగల్లో పడ్డాడు. దీంతో ఆ తీగలు మెడకు బిగుసుకుని ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద ఘటన సోమవారం మండలంలోని కేసముద్రం విలేజ్‌లో జరిగింది. గ్రామానికి చెందిన కీర్తి వెంకన్న(50) తన మేకలకు మేత కోసం ఇంటి సమీపంలో ఉన్న చెట్టు ఎక్కాడు. తీగలను కోస్తున్న క్రమంలో కాలు జారడంతో కొమ్మపై నుంచి తీగల్లో పడ్డాడు. దీంతో ఆ తీగలు అతడి మెడకు బిగుసుకోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి తీగల్లో చిక్కుకున్న వెంకన్నను కిందకు దింపి చూడగా..ఆయన అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. మృతుడికి భార్య సావిత్రి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలిని ఎస్సై తిరుపతి పరిశీలించారు.

రూ.20వేల విలువైన కలప పట్టివేత

వెంకటాపురం(కె): అటవీ శాఖ సిబ్బంది సోమవారం రూ.20వేల విలువైన మారుజాతి కలపను పట్టుకున్నారు. మండల పరిధిలోని మరికాల గ్రామంలో ఆరు ఎడ్లబండ్లపై తరలిస్తున్న ఈ కలపను స్వాధీనం చేసుకుని వెంకటాపురం(కె)లోని రేంజర్ కార్యాలయానికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు.



అటవీ శాఖ సిబ్బంది పట్టుకున్న కలప

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE & PLOTS FOR SALES

ఫామ్‌ల్యాండ్స్, ఓపెన్ ప్లాట్స్, న్యూ హౌసెస్, ఓల్డ్ హౌసెస్, తక్కువ ధరకే లభించును. మరిన్ని వివరాలకు వెంటనే సంప్ర။ 9014743326. [W-785690]

PLOT FOR SALE

వరంగల్ జానోపీలు రైల్వే గేట్ ప్రక్కకు 109 గజాల ఉత్తరం ఫేస్ గల Open Plot అమ్మబడును. వివరాలకు సంప్ర: సెల్: 9849459661. [W-785682]

HOUSE FOR SALE

వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-785686]

WANTED

ప్రముఖ హోటల్ మరియు ఆఫీస్‌లో పని చేయడానికి భార్యాభర్తలు కావలెను. జీతం మరియు వసతి ఇవ్వబడును. మరిన్ని వివరాలకు సంప్రదించండి. 7799007778, 7799007776 [W-1110347]

ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221199]

VISA Consultation Overseas Blue & White Collar Jobs All Profiles Lucrative Salary Highpay. Interviews Vizag 9th to 11th July&Hyd. 13th&14th July. Ph: 9717618737 [HA-3289]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

WANTED TEACHERS

Wanted Teachers to teach Science upto 7th class. Vandhana High School, Shivanagar, WGL. Cell No: 9849943040. [W-785689]

Wanted Lady Teacher to Teach Eng, Maths, Hindi & Supporting Teachers for 1st to 5th. Eng Teacher for High School. Indian Kids High School, SVN Road, Warangal. Cell: 9963006221. [W-785681]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.